# రాత్రి పూట

మూడు ఎప్పుడు అవుతుందా అని చూస్తూ ఉన్నాను. ఇప్పుడు రెండున్నర. యింకో అరగంట ఆగితే- మహానుభావుడు ఎన్టీఆర్ నిద్ర లేచే టైము. ఇలాంటి టైములో ఇంత రాత్రివేళ ఇంట్లో మేలుకొని ఉన్నాను.

నిద్ర వస్తోంది. కాని ఈ అరగంట కాచుకోవాలి.

కాసేపు పరుపు మీద దొర్లాను. హాల్లోకి వెళ్లి లైటు వేసుకొని సోఫాలో కాళ్లు చాపుకున్నాను. అక్కడా కుదురుగా అనిపించక ఖాళీ నేల మీద దిండు పడేసి కవులు యిష్టపడే మట్టివాసన ఇదే కదా అనుకుంటూ ఒక సెంటిమెంట్‌తో నడుము వాల్చాను.

మూడు.

క..క్క..క..కా..క్క... అని చప్పుడు వినిపించింది.

లేచి కూర్చున్నాను.

అమ్మయ్య... దేవుడి దయ వల్ల యింక నిద్ర పోవాల్సిన బాధ లేదు అనుకున్నాను. ఆ చప్పుడు మా రెండోవాడిది. వాడికిప్పుడు ఆరోనెల. వాడు రోజూ సరిగ్గా ఇదే టైముకి పాల కోసం లేచి తెల్లారి ఆరుగంటల దాకా ఆడుకుం

టాడు. మధ్య మధ్య ఇల్లు మరీ కామ్‌గా ఉందని అనిపిస్తే కాసేపు ఏడుస్తాడు. లేకుంటే ఫ్యాను వైపూ నా వైపూ మార్చి మార్చి చూస్తూ దీర్ఘమైన ఆలోచన చేస్తాడు. కొత్తగా బోర్లా పడుతున్నాడు. ఆ హుషారులో వాణ్ణి మెలకువగా వదిలి పెట్టడం కష్టం.

వాడు లేవగానే నా భార్య కీ ఇచ్చినట్టుగా లేచి కళ్లు మూతలతోనే ఉంచి ఫ్లాస్క్ కోసం వెతుక్కుంటుంది. అందులో వేడినీళ్లు ఉంటాయి. పక్కనే పాల డబ్బా. పాలు కలపడానికి స్టీలు గిన్నె. పాలు కలిపి పాలు తాపి ఎక్కడ ఎలా నిద్ర లేచిందో అక్కడ అలా నిద్రపోతుంది.

ఈ మధ్య మాకు ఒక పిల్లల డాక్టరు తగిలాడు. చాలా మంచి డాక్టరు. కాని ఫీజు దగ్గర అమిత మొహమాటస్తుడు. ఒక్కసారి హాస్పిటల్‌కు వెళితే మన పైజేబులో ఉన్న డబ్బులే కాకుండా దూరంగా ఏటీఎంలో ఉండే డబ్బులు కూడా కౌంటర్‌లో కట్టేదాకా మనల్ని మొహమాట పెడుతూనే ఉంటాడు.

పిల్లలన్నాక ఏవో ఒకటి వస్తూనే ఉంటాయి. వచ్చినప్పుడల్లా రెండు మూడుసార్లు నేను కౌంటర్ దగ్గర దివాలా దీసి నాలుగోసారి ఖాళీ జేబుతో తల గీరుకుంటూ కనిపిస్తే మా బావమరిది తెంపుగా వెళ్లి ఇంకా మెచ్యూర్‌కాని సొంత ఫిక్స్‌డ్ డిపాజిట్‌ని బద్దలు కొట్టి చొరవగా డబ్బులు కట్టాడు. అతడిలోని మానవతకు సొంత మనుషుల పట్ల అతడికున్న కరుణకు స్పందించి అతడి భార్య వారం రోజుల పాటు పుట్టింటికి వెళ్లిపోయింది.

ఆ గొడవ అలా ఉండగా ఈ డాక్టర్ నా భార్యతో ఏం చెప్పాడంటే- అమ్మా... పాలసీసాలతో పాలు పట్టడం తప్పు... బ్యాక్టీరియా చేరుతుంది... కనుక స్టీలుగ్లాసుతోనే పాలు పడుతూ ఉండూ అన్నాడు.

కాబట్టి మావాడు నిద్రలోకదిలినప్పుడల్లా పాలపీక నోట్లో పెట్టి పడుకునే భాగ్యం మాకు లేకపోయింది. ఇప్పుడు వాడు లేచాడు. పాలు తాగాడు. ఇంక ఆడుకోవాలి.

నేను వాణ్ణి ఎత్తుకొని నిద్రపోతున్న నా భార్యని సుతారంగా తట్టి తల నిమిరి 'ఏరా.. నాన్నా.. నువ్వు నిద్రపోరా... నేను వాణ్ణి చూసుకుంటాగా... సరేనారా... ఏరా ... రా రా రా' అని ఆత్మీయంగా 'రా' భాషలో బుజ్జగించి వాణ్ణి తీసుకొని హాల్లోకి వచ్చాను.

కొంతమంది భర్తలు వాళ్ల భార్యలతో ఆత్మీయంగా మాట్లాడాలనుకున్న

ప్పుడు వాళ్లను మామూలుగా కాకుండా ఇలా 'రా' భాషలో బుజ్జగిస్తూ పుంలింగంతో వ్యవహరిస్తూ ఉంటారు.

ఇది ఇమిటేట్ చేయాలని నాకు కోరిక.

ఇలాంటి టైములో బాగా తీరిగ్గా ఉంటాను కాబట్టి అలా ఇమిటేట్ చేసి ముచ్చట తీర్చుకుంటూ ఉంటాను.

మావాడు మళ్లీ 'క' గుణింతపు చప్పుడు చేశాడు. వాడితో మాటలు చెప్పాలి. లేకుంటే ఏడుస్తాడు.

నేను వెంటనే- నా బుజ్జికన్నా... నా చిట్టికన్నా... నా చిన్నులు నాన్నా... నా చిన్నబుజ్జి కన్నా... నా బజ్జోలు కన్నా... లాంటి భావగర్భితమైన మాటలె న్నింటినో వాడితో మాట్లాడటం మొదలుపెట్టాను.

మూడూ ముప్పావు.

నిద్ర వచ్చింది. కాని నేను దానిని అవమానించి పరాభవించి బట్టలు చించేసి పంపించేశాను. సాధారణంగా ఈ మధ్య నా నిద్ర మూడు విధాలుగా నిరాకరణకు లోనవుతూ ఉంది. రాత్రి రెండు లోపల నా పెద్ద కొడుకు వల్ల నిరాకరణ. మూడు తర్వాత నా చిన్నకొడుకు వల్ల నిరాకరణ. మధ్యలో దొరికే ఆ గంట మాత్రం దేనికి అని నా పంతం వల్ల స్వీయనిరాకరణ.

మా యింట్లో ఏం జరుగుతుందంటే మధ్యాహ్నం ఒంటిగంటప్పుడు నా భార్య గిన్నెలో రసం అన్నం కలుపుకొని నంజుకోవడానికి చియ్యా వేసుకొని నా పెద్ద కొడుకుతో కూర్చుంటుంది. వాడికి మొన్నే మూడు నిండి నాలుగు వచ్చాయి. ప్రవర్తనకు చాలా మంచివాడు. కాని చెప్పినమాట ఏదీ వినడు. తిండి దగ్గర వాడికి డిఫరెన్స్ ఉంది. ప్రతి మూడో ముద్దా ఊస్తాడు.

నా భార్య వాడి దగ్గర కూర్చుని నెత్తి లబలబా కొట్టుకొని ఒరే తినరా... నువ్వు తినకుంటే ఎలారా... తినరా... లేకుంటే గుడ్లు పీకేస్తానురా అని ప్రేమగా బతిమిలాడి మేము ఉంటున్న మూడో ఫ్లోర్‌లో ఒక ముద్ద తినిపిస్తుంది. తర్వాతి ముద్ద నాలుగోఫ్లోర్‌లో తినిపిస్తుంది. ఇంకో ముద్ద సెల్లార్‌లో... ఆఖరు ముద్ద సికింద్రాబాద్‌లో తినిపించి ఆటో ఎక్కి ఇంటికొస్తుంది. ఆ తర్వాత వాడు నిద్రపో తాడు. ఆ పోవడం పోవడం ఆరు గంటలకు లేచి ఏడుదాకా ఆవలించి ఎనిమిద య్యేసరికి స్నానంచేసి మంకూ గింకూ ఎగిరిపోయి నీ అబ్బకు నా అబ్బ ఏం కావాలా అన్నట్టుగా తయారై ఉంటాడు.

నేను పొద్దుననగా ఆఫీసుకు వెళ్లి రాత్రి తొమ్మిదింటి దాకా పని చేసి పంజగుట్టా- ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్‌జామ్‌లో ఓ గంటసేపు సరదాగా గడిపి పదింటికి ఫ్రెష్‌గా ఉత్సాహంగా కళ్లల్లో ప్రాణాలు పెట్టుకొని వస్తాను కదా యింక వాడు నన్ను తగులుకుంటాడు. కథలు చెప్పాలి. లేకుంటే వినడు. నేను చేసిన అలవాటే. కాని తెలియక చేసిన తప్పు.

అప్పటికి కాశీమజలి కథలన్నీ చెబుతాను. అరేబియన్ నైట్స్‌లోని కథలన్నీ చెబుతాను. రాజులవి చెబుతాను. సైనికులవి చెబుతాను.

వాడు నిద్రపోడు.

'ఇంకో కథ చెప్పు' అంటాడు.

నాకు గుర్తున్న కథలు అయిపోయి ఉంటాయి.

వేరే దారి లేక కథారచనను సీరియస్‌గా తీసుకుని తెలుగు కథను ముందుకు నడిపిస్తున్న నా సహరచయితల కథలు చెప్పడం మొదలుపెడతాను. గ్లోబలైజేషన్ కథలు అస్తిత్వవాద పోరాట కథలు మనకు తెలిసిన మనకు తెలియని మనకు తెలిసీ తెలియని మన కథలు అనువాద కథలు... వాడు నిద్రపోడు.

ఈ లోపల నా భార్య మధ్యలో ఒకసారి లేచి 'కుహూ.. కుహూ' అంటుంది.

నేను 'కూ.. కూ' అంటాను.

ఇది మా కోడ్ లాంగ్వేజ్.

'వాణ్ణి తొందరగా నిద్రపుచ్చి తొందరగా రారా మగడా' అని నా భార్య శబ్దానికి అర్థం.

'ఉండు. వస్తున్నానుగా. వాడు నిద్రపోనీ' అని నా శబ్దానికి అర్థం.

వాడేమో నిద్రపోడు.

'లాస్టు... తగళి శివశంకర్ పిళ్లై కథ ఒక్కటి చెప్పు' అంటాడు.

అప్పటికి ఒంటి గంట అయి ఉంటుంది.

నేను తగళి శివశంకర్ పిళ్లై కథ చెప్పాక వాడు నిద్రపోతాడు.

నా భార్య కూడా నిద్రపోతుంది.

చేసేదేం లేక మూడు ఎప్పుడు అవుతుందా మా రెండోవాడు ఎప్పుడు

లేస్తాడా తెల్లారి ఆరుదాకా వాడితో ఎప్పుడెప్పుడు గడుపుదామా అని నేను కాచుకొని ఉంటాను.

నాలుగుంపావు.

మావాడు ఆటలాడే ఫేజ్‌లో నుంచి దీర్ఘాలోచన ఫేజ్‌లోకి వచ్చాడు. ఇది ఒక రకమైన ప్రశాంతత నిండిన ఫేజ్. ఈ ఫేజ్‌లో వాడు నన్నూ ఫ్యాన్‌ను మాత్రమే చూస్తూ ఉంటాడు. ఇలాంటి టైములో దివాన్ మీద బాసింమెట్టు వేసుకొని వాణ్ణి వొడిలో వేసుకుంటే వాడేమీ అభ్యంతరం పెట్టడు. ఈ దశ కోసమే నేను ఎదురు చూస్తూ ఉంటాను. ఎందుకంటే అది నన్ను కాసేపు పుస్తకాలు చదువుకోనిస్తుంది.

ఇంటి నిండా పుస్తకాలు ఉన్నాయి. కాని ఒక్కటీ చదవడానికి కుదరదు. బ్యాచిలర్‌గా ఉండగా రాత్రి తెల్లవార్లూ పుస్తకాలు చదివి బయటకు షికారుకు వెళ్లి టీ తాగి వచ్చి నిద్రపోయిన సందర్భాలు ఉన్నాయి. కాని పెళ్లయిన తర్వాత ఆ లగ్జరీ పోయింది.

ఏ మాటకామాటేచెప్పుకోవాలి నా భార్య తక్కిన విషయాల్లో ఎలా ఉన్నా మాట మీద నిలబడటంలో మాత్రం జగమొండి. మా పెళ్లయిన పదోరోజు గదిలో కొత్త పెళ్లికూతురు ఉందన్న సంగతి కూడా పట్టకుండా నా మానాన నేను పుస్తకం పట్టుకొని ఉంటే నా భార్య చూసీ చూసీ నా దగ్గరకు వచ్చింది.

'ఏమండీ... ఏమిటండీ ఇది... ఒక మాటా ఒక మంతీ లేకుండా. మీరు రచయితలని నాకు తెలుసు. మీరు పుస్తకాలు చదవాల్సిందే. కాని నాకొక్క బిడ్డను కనివ్వండి. ఆ తర్వాత మీ జోలికిరాను. ఆ పుస్తకాలేమిటో ఆ గొడవేదో మీరే పడుదురు గానీ..' అని కళ్లల్లో కళ్లుపెట్టి మాట ఇచ్చింది.

ఆమె ప్రేమకు ఆ కళ్లల్లోని పాశానికి నేను లొంగిపోయాను.

పెద్దాడు పుట్టాడు.

వాడి మొదటి పుట్టినరోజు రాత్రి చాలా రోజులయ్యింది కదా అని నేను మళ్లీ పుస్తకం పట్టుకొని కూర్చుంటే నా భార్య చూసీ చూసీ నా దగ్గరకు వచ్చింది.

'ఏమండీ... ఏమిటండీ ఇది... ఒకమాటా ఒక మంతీ లేకుండా. మీరు రచయితలని నాకు తెలుసు. మీరు పుస్తకాలు చదవాల్సిందే. కాని నా బిడ్డకు యింకొక్క తోడును ప్రసాదించండి. ఆ తర్వాత మీజోలికి రాను. ఆ పుస్తకాలేమిటో ఆ గొడవేదో మీరే పడుదురు గానీ..' అని కళ్లల్లో కళ్లుపెట్టి మాట ఇచ్చింది.

ఆ ప్రేమకు ఆ కళ్లల్లోని నిజాయితీకి నేను లొంగిపోయాను.

మొన్న- నాలుగు రోజుల క్రితం- నేను పుస్తకం కూడా తీయలేదు. అలా ర్యాక్ దగ్గర నిలబడ్డానంతే. వెంటనే నా భార్య స్పందించి గబగబా నా దగ్గరకొచ్చి- 'ఏమండీ... ఏమిటండీ ఇది... ఒక మాటాఒక మంతీ లేకుండా. ఒక పని చేయండి. నా ఇద్దరు బిడ్డలకూ ఒక్క ఐదేళ్లు రానివ్వండి. ఇంక మీ జోలికి రాను. ఆ పుస్తకాలేమిటో ఆగొడవేదో'....

నాలో ఒక రకమైన మానసిక ఉద్వేగం కలిగింది. ఆ ఉద్వేగంలో తీవ్రత నిండిన ఆరాధనతో నా భార్యవైపు చూసేసరికి ఆమె కొంచెం జంకింది.

అయితే ఇందులో ఆమె తప్పు ఏమీలేదు.

మొన్న మేము రైతుబజారుకు వెళ్లి కొత్తిమీరా క్యాబేజీ తరిగిన ములక్కాడలు... ఇవన్నీ సంచిలో వేసుకొని తల మీద సొరకాయ పెట్టుకొని నేను నడుస్తూ ఉంటే నా ఫ్యాన్ ఒకామె మాకు ఎదురుపడింది. లోకంలో ఇంతకు మించిన చోద్యం ఏమీ లేదు అన్నట్టుగా ఆమె బుగ్గలు నొక్కుకొని ఎంతో కంగారు పడి 'అయ్యో... ఏమిటండీ ఇది... ఈయనతో కూరగాయలు మోయిస్తున్నారా?' అంది.

నా భార్య ఎవరైనా అరెస్టు చేయబోతారా అన్నట్టుగా అటూ ఇటూ చూసి 'ఏమండీ.. మోయించకూడదా?' అంది.

'అది కాదండీ... ఆయన ఎవరనుకున్నారు. మహా రచయిత. ఎన్నిజన్మలు ఎత్తితే ఇలాంటి జన్మ దొరుకుతుందండీ. ఈ జన్మలో వీళ్లను వదిలేయాలి. మనం డిస్టర్బ్ చేయకూడదు. సమాజం కోసం వీళ్లను రాయనివ్వాలి. తిరగనివ్వాలి. పుస్తకాలు చదువుకోనివ్వాలి. అసలు వీళ్లను దూరం నుంచి చూడ్డమే భాగ్యం అనుకోవాలి'... అని ఇంకా ఏమిటేమిటో చెప్పింది.

ఆమెను అలా వెళ్లనిచ్చి నా భార్య 'ఎల్లెల్లవమ్మా పెద్ద చెప్పొచ్చావుగాని. నాక్కూడా ఒకటే జన్మ. ఈ జన్మలో నా మొగుడూ పిల్లలతో గడపాలని నాకు ఉంటుందిగాని మొగుణ్ణి దేశానికి వొదిలి టీవీ ముందు చాప పరుచుకొని పడుకోవాలని ఉంటుందా?' అంది నా భుజాన్ని గట్టిగాపట్టుకొని. ధర్మకాటాలో సరిగ్గా తూకం వేసినట్టుగా ఉన్న ఆ మాటలకు నేను బదులు చెప్పలేకపోయాను.

కాని అప్పుడప్పుడు పుస్తకాలు నా కల్లోకి వచ్చేవి. చిన్నప్పుడు, నా ఎనిమిది తొమ్మిది తరగతుల్లో స్కూలు బోరుకొట్టినప్పుడల్లా ఎగ్గొట్టి ఊరికి దూరంగా మిట్ట మీద ఉండే మా మేనత్త ఇంటికి వెళ్లేవాణ్ణి.

అక్కడంతా ఎప్పుడూ గాలి.

పెదాలను ముక్కును కళ్లను జుట్టును నిమురుతూ ఎప్పుడూ ఉత్సాహంగా కుదురు ఎరగనట్టుగా తిరిగేంత గాలి.

మా మేనత్త ఇల్లంటే- ఒక సిమెంటు గది, దానికి జార్చిన తాటాకుల వసారా, గులకా మట్టీ తేలిన పెద్ద ముంగిలి, బావి, దానికి ఆనుకుని పెద్దజామ చెట్టు, పక్కనే కట్టెల పొయ్యి... వీటన్నింటితో పాటు గాలి... ప్రాణం లేచి వచ్చే దక్కడ.

నన్ను చూడ్డంతోటే మా మేనత్త 'స్కూలు ఎగ్గొట్టి వచ్చావ్రా' అని కూడా అడిగేది కాదు. పిల్లలు ఎవరొచ్చినా ఆమెకు సంతోషమే.

నా కోసం మా మేనత్త జామచెట్టు కింద నులకమంచం పరిచేది. దాని మీద బొంత వేసేది. దిండు పెట్టేది. మా మేనత్తవాళ్లు పిల్లల మిఠాయిలు తయారు చేసి అమ్మేవాళ్లు. వాటికి కవర్లు తయారు చేయడం కోసం తూకానికి పాత పత్రికలన్నీ కొనుక్కువచ్చేవాళ్లు. నాకు పుస్తకాలు చదవడం ఇష్టమని వాటన్నింటినీ తెచ్చి మంచం మీద పెట్టేది. నేను ఆడుకోకుండా అల్లరి చేయకుండా ఆ గాలిలో ఆ చల్లటి జామచెట్టు నీడలో ఆ పుస్తకాలు చదువుకుంటూ ఆ సుఖంలో ఉండిపోయేవాణ్ణి. మధ్య మధ్య మా మేనత్త వీలుని బట్టి పొయ్యిలో గెనుసుగడ్డలు కాల్చి ఇచ్చేది. తేగలు కాల్చి ఇచ్చేది. పనసగింజలు కాల్చి ఇచ్చేది. జీడిగింజలు కాల్చి పగులగొట్టి ఇచ్చేది. ఇవన్నీ లేకపోతే కమ్మటి వాసనలు వచ్చేలా కొంచెం ఉప్పుచాపను కాల్చి ఇచ్చేది. మంచి ఎండపూట రేడియోలో పాటలు వింటూ పొయ్యి మీద ఉడికే కూర సువాసనలు పీలుస్తూ మా అత్త చెప్పే మాటలు ఆలకిస్తూ నడుమ పుస్తకాలు చదువు కుంటూ.... చిన్నప్పుడు అదంతా పేదరికం అనుకునేవాణ్ణి. కాని ఈ నగరానికి వచ్చాక ఈ నగరజీవితంలో కూరుకుపోయాక అదెంత పెద్ద లగ్జరీయో అర్థం అవుతోంది.

ఇలాంటి మాటలు కొందరికి మిడిమేలంగా అనిపించవచ్చు.

సరే ఇది చూడండి.

మొన్న ఆఫీసుకు వెళదామని చెప్పి సెల్లార్‌లో బైక్ తీస్తూ ఉంటే నాలాగే ఆఫీసుకు వెళ్లడానికి బైక్ స్టార్ట్ చేసి వెళ్లబోతున్న ఒకతను నన్ను చూసి పరీక్షగా గాబరాగా ఆగిపోయాడు. నేను కూడా అలాగే గాబరాగా పరీక్షగా ఆగిపోయాను.

'మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుందే' అన్నాడు.

'మిమ్మల్ని కూడానండీ' అన్నాను.

మేమిద్దరం ఒకరినొకరం పరీక్షగా చాలాసేపు చూసుకున్నాం.

క్రమంగా మా కళ్లలో నీళ్లు నిండాయి.

గుర్తు పట్టాను.

వాడు నా సొంత తమ్ముడే. ఈస్ట్ బ్లాక్‌లో ఉంటాడు. పొద్దుననంగా లేచి, ఆఫీసనీ డ్యూటీ అనీ పక్కనే వెస్ట్ బ్లాక్‌లో ఉన్న నా కంటికి కూడా కనిపించకుండా తిరుగుతూ ఉంటాడు. ఇదిగో మేమిద్దరం ఇలా రెండు నెల్లకో మూడు నెల్లకో ముఖాలు మర్చిపోయాక ఒకరినొకరం పోల్చుకుని కళ్లల్లో నీళ్లు నింపుకుంటూ ఉంటాం.

మా యిద్దరి సంగతేనా ఇది? సిటీలో అందరూ ఇంతే. ఆఫీసు ఇల్లు... ఆఫీసు ఇల్లు... ఆఫీసు ఇల్లు... ఈ ఆఫీసు ఇల్లులో పడి చిన్న చిన్న లగ్జరీలు కూడా లేకుండా బతికేస్తున్నారు. సాయంత్రం పూట స్నేహితులను కలిసే లగ్జరీ... ఊరు వెళ్లి అమ్మను చూసి వచ్చే లగ్జరీ... వీధుల్లో ఆడే పిల్లలను తేరిపారా చూసే లగ్జరీ... ఏదైనా రాత్రిపూట  చుక్కలను చూసే లగ్జరీ... చందమామతో ఏకాంతంగా కళ్లు కలిపే లగ్జరీ...

మావాడు కదిలాడు. వొడిలో అటూ ఇటూ కదిలి 'క' గుణింతపు చప్పుడు చేశాడు. ఇదివాడు నిద్రకు సిద్ధమయ్యే టైము. కాసేపు ఎత్తుకొని తిరిగితే నిద్రపో తాడు.

అయిదున్నర.

నా భార్య మంచినీళ్లకని లేచింది. కిచెన్‌లోకి వెళ్లి మంచినీళ్లు తాగి బెడ్ రూమ్‌లోకి వెళుతూ ఎందుకైనా మంచిదని గడప దగ్గర ఆగి పెదవి కొస నుంచి కంఠం మీదకు జారిన నీటిధార సొగసుతో నిలబడి ప్రశ్నార్థకంగా చూసింది.

నేను వెంటనే 'జాంద్ర.. జాంద్ర' అన్నాను.

అంటే– 'లాభం లేదులే. వెళ్లి పడుకో. యివాళ ఇది అయ్యేట్టు లేదు. వీడు యింకా పడుకోలేదు. చూద్దాం. రెండు మూడు నెలల్లో మనకూ సందర్భం రాక పోతుందా? ఎం చేస్తాం. అన్నింటికీ ఆ పైవాడే ఉన్నాడు' అని అర్థం.

నా భార్య వెళ్లిపోయింది.

మావాడు నిద్ర వస్తున్నట్టుగా కళ్లు మూసీ తెరుస్తూ ఉన్నాడు.

చుట్టూ చీకట్లు తగ్గాయి. కిటికీల అవతల నుంచి పలుచటి తెలుపు కనిపిస్తూ ఉంది. సెక్యూరిటీ వాళ్ల విజిల్స్ ఆగిపోయాయి. మావాడు నిద్రపోయాడు. ఇంక రెండు జోలపాటలు వినిపిస్తే నేను కూడా నిద్రపోతాను.

ఈ మధ్య ఈ జోలపాటలు వినకుండా నేను నిద్రపోవడం లేదు.

మొదటిది మా ఇంటి ఓనర్‌ది. ఆయనది మా పక్క ఫ్లాటే. వాళ్ల నాన్నకు ఎనభై ఏళ్లు ఉంటాయి. పాపం ఆ కొడుకు పొద్దున్నే ఆఫీసుకు వెళ్లి రాత్రికి ఇంటి కొచ్చి శని ఆదివారాలు టూర్‌కు వెళ్లి సోమవారం ఇంటికి వచ్చి... పెరిగిన గడ్డంతో ప్రశాంతంగా గడుపుతూ ఉంటే ఆ ప్రశాంతత ఏం సరిపోతుంది అన్నట్టుగా ఆ ముసలాయన సాయంత్రంపూట షికారుకు వెళ్లి కాలు విరగ్గొట్టుకొని వచ్చాడు. దానికి విరుగుడుగా పొద్దున్నే ఏవో ఎక్సర్‌సైజులు చేయించాలి.

ముసలాయనకు వినపడదు.

కొడుకు ఉదయాన్నే లేచి 'నాన్నా... కాలు తెరువు.. కాలుమడువు... కాలు తెరిచి మడువు... తెరిచి మడిచిన కాలుమళ్లీ తెరువు'...అని పెద్ద పెద్దగా అరిచి చెబుతూ మధ్యలో దమ్ము చాలక దగ్గుతాడు.

ఇదొక అరగంట సేపు జరుగుతుంది.

మా ఫ్లాట్స్ కట్టిన బిల్డరు, ఒకచోట నివసించే వాళ్ల మధ్యన అరమరికలు ఉంటే ఎలా అనే ఉద్దేశంతో జాగ్రత్తగా ప్లాన్ చేసి కట్టడం వల్ల ఇలాంటి అరుపులూ కేకలూ అన్నీ అందరికీ స్పష్టంగా సూటిగా సుత్తి లేకుండా వినబడుతూ ఉంటాయి.

రెండోది మా కింది ఫ్లాట్ వాళ్లది.

అందులో ఇద్దరు అత్తాకోడళ్లు ఉంటారు. కోడలు ఉదయాన్నే ఆరుగంట లకల్లా నిద్రలేచి బ్రష్ చేసుకొని జుట్టుకు రబ్బర్‌బ్యాండ్ కట్టుకొని 'ఏం అత్తమ్మా' అంటుంది.

దానికి అత్తమ్మ 'ఇదిగోమ్మా... వచ్చేస్తున్నానుగా.. ఒక్క అయిదు నిమిషాలు' అని గబగబా ముఖం కడుక్కొని రెడీ అయిపోతుంది.

ఇక అక్కణ్నుంచి వాళ్లిద్దరూ ఒకర్నొకరు తిట్టుకుంటూ చుట్టుపక్కల ఫ్లాట్స్ వాళ్లని నిద్రలేపేస్తారు.

ఇంత భావసారూప్యత కలిగిన ఈ ఇద్దరికీ ఆటంకం కలిగించడం ఎందుకూ అని కొడుకు ఐదు గంటలకే నిద్రలేచి మార్నింగ్ వాక్ పేరుతో ఇంటి నుంచి

బయటపడి అటు నుంచి అటే ఆఫీసుకు వెళ్లి రాత్రికి సెకండ్ షో చూసుకొని డూప్లికేట్ కీతో తలుపు తెరుచుకొని అలో లక్ష్మణా అని నిద్రపోతాడు.

ఇదీ తమాషా.

ఈ తమాషా అంతా ఈ రాత్రితెల్లవార్లూ కూర్చుని మిమ్మల్ని నవ్వించడానికి చెప్పానా?

ఏం కాదు.

మనలో ప్రతి ఒక్కరి జీవితంలో ఏదోఒక డ్రామా నడుస్తూ ఉంటుంది. దానిని వినోదంలా చూడాలి. ఇది వినోదం కాదు... గినోదం అని ఎప్పుడైతే అనుకుంటామో అప్పుడు మన పని సఫా. భరించలేను ఆత్మహత్య చేసుకుంటా అని చీటీ రాస్తే మన బతుకే సఫా.

చిన్నప్పుడు మా నాయన ఎప్పుడైనా చిన్నబుచ్చుకుంటే ఏదైనా కష్టం వొచ్చి ఎలా చేయాలిరా అని డీలా పడితే మా నాయనమ్మ అదేం లెక్కలేనట్టుగా గడప దగ్గర కూర్చుని ఉర్లగడ్డ తొక్కు తీస్తూనో బియ్యంలో రాళ్లు ఏరుతూనో 'ఒరే... అబ్బాయ్. రోజూ రాత్రి వస్తుందిగానీ అంతమాత్రాన రోజంతా రాత్రి ఉంటుందా?' అనేది.

అలాంటి మాటలేవో నుదుటికి అంటించుకోవాలి.

పగలు వస్తుందిలే అని ఎదురు చూడాలి.

అంతవరకు?

మన వినోదం చాలకపోతే పక్కింటివాళ్లది చూడాలి. లేకుంటే ఎదురింటివాళ్లది చూడాలి. అదీ సరిపడకపోతే న్యూస్‌చానెల్సు చూడాలి.

అంతేతప్ప, బతుకు బాగలేదని మెడకు ఉరి చుట్టుకుంటారా ఎవరైనా?

అరిష్టం.

సాక్షి ఆదివారం 2009